కథా నిలయం
శ్రీకాకుళం

# 25

# పిచ్చిదేవత అను గొర్రెల కథ

మహాలక్ష్మి క్లాత్ స్టోర్స్ అద్దాల కౌంటర్‌లో కూర్చున్న ప్రసాదరావు తదేకంగా ఆమె వైపే చూస్తున్నాడు. సందేహం లేదు. ఆమే.

అతనికి నిన్న రాత్రి సంఘటన జ్ఞాపకమొచ్చింది.

మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో నవనీతరావు హైదరాబాద్ వెళ్తూ తనను స్టేషనుల్లో కలుసుకోవలసిందిగా టెలిగ్రాం ఇస్తే వెళ్ళాడు తను.

రాత్రి రెండూ నలభై నిముషాలు. రైలు అరగంట లేటు.

రైల్వేస్టేషన్ నిశ్శబ్దంగా ఉంది. మంచి నిద్రవేళ. ఫ్లాట్‌ఫాంపై సిమెంటు చప్టామీద ఇద్దరు పోర్టర్లు నిద్రపోతున్నారు. అక్కడక్కడ అతికొద్దిగా ఉన్న ప్రయాణీకులు ఒదిగి ఒదిగి ముడుచుకొని పడుకున్నారు వీలున్న చోట్లలో. స్టేషన్‌మాస్టర్ రూంలో నల్లకోటు తొడుక్కున్న ఓ లావాటి బట్టతల మనిషి టేబులుపై తలవాల్చి గుర్రుకొడ్తున్నాడు. అతని తలదగ్గర ఎందుకో ఓ ఎర్రని గార్డువాడే దీపం పెట్టి వుంది.

చలికాలమవడంతో ఉండి ఉండి రివ్వున గాలి చొచ్చుకొచ్చి జలదరింపజేసి వెళ్తోంది. స్టేషన్‌కు కనుచూపుమేరలో పట్టణమంతా సన్నని మేలి ముసుగులో దాక్కున్నట్టుగా కనిపిస్తోంది. దూరంగా సిగ్నల్ లైట్లు ఎర్రగా-

ఓ చిత్రమైన అనుభూతి ఆ లైట్లను చూస్తున్నప్పుడు

ఎక్కడో ప్రయాణించవలసిన ప్రాంతాలు.. అందని గమ్యాలు ....

ఎవరో వస్తారన్న ఎదురుచూపు ... తప్పనిసరిగా సాగవలసిన జీవితయానం.

ఏదో కోల్పోతున్నట్టు, మరేదో పొందబోతున్నట్టు కలగాపులగమైన అస్పష్టఆలోచనలు.

దూరంగా రైలుపట్టాలు భూమిపై పరచిన మెరుపుతీగల్లా మెరుస్తున్నాయి.

ప్రసాదరావు చెవుల చుట్టూ కట్టుకున్న మఫ్లర్‌ను మరింత బిగదీసుకుని, వణుకుతున్న చేతులతో సిగరెట్టు పెట్టె తెరచి పెదవుల మధ్య సిగరెట్టు పెట్టుకొని సర్రున అగ్గిపుల్ల గీసి - ఎర్రగా మంట

పొగ గుండెల నిండా క్రమ్ముకున్నట్టయి .... ఏదో వెచ్చగా .

ఏదో చేద్దామిప్పుడు అన్నట్టు చుట్టూ చూశాడు ఒంటరితనం భరించలేక.

ఎటూ తోచక ప్లాట్‌ఫాం ఈ కొసనుండి ఆ చివరి వరకు నడుస్తే బాగుంటుందే మోననిపించి ... నడుస్తుండగా,

పుస్తకాల కొట్టుదాటి, నిద్రపోతున్న టీ షాప్ దాటి ... పోలీస్‌యార్డు దాటి -

సిమెంటు బెంచీపై ... ఒంటరి దీపస్తంభం క్రింద కురుస్తున్న పల్చని గుడ్డి వెలుగులో ఒంటరిగా ఆమె.

చలిలో..... ఒంటిపై సరియైన అచ్ఛాదన లేకుండా, శష్పలా, తలవంచుకొని, చింపిరి తలతో -

అస్పష్టంగా కనపడ్తున్న ఆమెవైపు పరిశీలనగా చూస్తే కనబడింది. ఆమె తలవంచుకుని, కళ్ళు మూసుకొని పిల్లనగ్రోవిని ఊదుతోంది.

ఆ ముఖంలో ప్రపంచాన్ని మరచిపోయిన సమాధిస్థితి

పాటకోసమే పుట్టి .... పాటకోసమే బ్రతుకుతూ... పాటకోసమే చచ్చిపోతానన్నంత పారవశ్యం ఆమెలో.

పాట గాలిలో తేలివస్తూ.. ఎంతో శ్రావ్యంగా, ఎంతో మధురంగా, ఎక్కడో ఎదలోయల్లో నిద్రిస్తున్న పిపాసను తట్టి లేపుతూ.

ఒళ్ళు రోమాంచితమై పులకించి పోతూ - క్షణంపాటు అడుగులు తడబడి, నిలబడి వింటున్నాడు. తన్మయత్వంలో మునిగి ఏమాత్రం అలికిడి చేసినా ఆమె తెప్పరిల్లి పాడడం ఆపుతుందేమోనని భయం.

సన్నని మృదువైన స్వరం తరంగాలుగా, పొరలుపొరలుగా, పాయలై, నదులై - జలపాతాల్లా నాద ప్రపాతాలై ... ఓహ్ ... ఎంత తీయగా వేణువును పలికించగలుగుతోందామె.

ఒకటి .... రెండు .... మూడు .... నిముషాలు గడిచి

నిద్రపోతున్న ప్రపంచాన్ని జోకొడుతూపోతున్న కాలానికి శబ్దపరిమళాన్ని అద్దుతూ ఎంత తీయని పాట.

ఎవరీమె .... ఆమె ఆకారం ఎందుకలా బికారిదానిలా ఉంది .... ఒంటిపైన సరియైన బట్టలు కూడా లేక ఎందుకలా ఉందామె. ఆమెలో అత్యంతాశ్చర్యకరంగా యింతటి మహత్తరమైన కళ క్షిప్తమై .... ప్చ్.

అకస్మాత్తుగా స్టేషన్ దగ్గరి నుండి గణగణమని కొడుతున్న గంటచప్పుడు ఓ సుడిగాలిలా చొచ్చుకొచ్చి, సరస్సులోకి రాయి విసరినట్టయి ఆమె చటుక్కున కళ్ళు విప్పి, పాట ఆపి.

రసధార తెగిపోయింది. అమృతవర్షం ఆగిపోయింది.

స్తంభపులైటు కాంతి ఆమె ముఖంపై పరచుకొని, ఆమె కళ్ళ నిండా భయం. ... శూన్యం ... ఖాళీ ... ఒట్టి భావం లేని చూపు.

మెల్లగా ఆమె లేచి ప్రక్కనున్న మాసిపోయిన సంచీని తీసుకొని పిల్లనగ్రోవిని దాంట్లో పెట్టుకుంటూ భయం భయంగా అతనివంక చూస్తూ,

ఆమె కట్టుకున్నది చీరకాదు. లంగా కాదు. ఏదో గుడ్డను అస్తవ్యస్తంగా ఒంటికి చుట్టుకోవడమే కాని కట్టుకోవడం కాదది. పైన ఒక వదులుగా ఉన్న రవికను తొడుక్కుంది. ముఖం జిడ్డుపట్టినట్టు దుమ్ముపట్టిన బెల్జియం అద్దంలా - ఇరవై ఐదు ఏళ్ళుంటాయేమో.

సంచిని పట్టుకుని దీనంగా, మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ నడిచివస్తూ, దగ్గర దాకా వచ్చి నిలబడి తలెత్తి కళ్ళలో కళ్ళు పెట్టిచూస్తూ,

భయమేసిందతనికి, ఆమె దగ్గరకు రావడం, మౌనంగా అలా చూడడం.... గ్రహించలేదతను....

"ఆకలేస్తోంది" అంది

ఎంత శ్రావ్యమైన కంఠం... ఓ వీణా తంత్రిని మీటి మాటలు పలికించినట్టు

"ఎవరు నువ్వు" అన్నాడతను.

"నేనా ... నేను ... నేను ... నేనే " అని కిసుక్కున నవ్వింది.

"నువ్వంటే ..."

"నేనే ... "మళ్ళీ నవ్వు. ఎందుకలా ఆమె అసందర్భంగా నవ్వుతోందో అతని కర్థం కాలేదు. మౌనంగానే జేబులో చేయిపెట్టగానే అందిన రెండ్రూపాయల నోటును అందించాడామెకు.

ఆమె అతని చేతిలో కాగితం వంక చిత్రంగా, పిచ్చిగా చూస్తూ "ఆకలైతే కాగితాన్ని తింటారా ఎవరైనా - అన్నం కావాలి" అంది.

నోటును ఒట్టి కాగితంగా భావించే ఈమె - అతని తలపై సుత్తితో కొట్టినట్లు షాక్ అనిపించి... వెంటనే లిప్తకాలంలో ఆమె బిగ్గరగా నవ్వడం ప్రారంభించి, మెరుపులా కదిలి, అక్కడి నుండి పరుగెత్తి ... వెళ్తోంది స్టేషన్ వైపు.... ప్రసాదరావు అవాక్కయిపోయి .... చేతిలోని సిగరెట్టు చురుక్కున కాలి.... ఉలిక్కిపడి చుట్టూ చూస్తే ... బెల్ వల్ల జనం మేల్కొని,

పోలీస్‌స్టేషన్‌లోనుండి అప్పటికే బయటకి వచ్చి ఉన్న వ్యక్తి "పిచ్చిది సార్ పాపం. అప్పుడప్పుడు యిక్కడికొచ్చి ఈ సిమెంట్ బెంచీపై పడుకుంటుంది. ఎలా నేర్చుకుందో గాని ఎప్పుడో రాత్రి ఉండి ఉండి చటుక్కున పిల్లనగ్రోవి వాయిస్తుంది. రాళ్ళు కరిగిపోతాయేమోనన్నంత మధురంగా పాడుతుంది. ఆ వెదురు గొట్టంతో ... ఎవరో ...

ఎక్కడుంటుందో ... ఎందుకిలా ఐందో ....పాపం పిచ్చిమాతల్లి..." నెత్తిపైనున్న టోపిని సవరించుకొని వెళ్ళిపోయాడతను.

అతనివైపు .... ఇంతకుముందు ఆమెపోయిన దిక్కు భారమెక్కిన గుండెలతో చూస్తూ ఉండిపోయి .... కాస్సేపయిం తర్వాత అటువేపే నడచి ...

ఆమె బ్రిడ్జ్ ప్రక్కన నిలబడి అటెటో చీకట్లోకి చూస్తోంది.

అతను వడివడిగా నడచి నిద్రపోతున్న టీ కొట్టువాన్ని లేపి ఓ బ్రెడ్ టీ తీసుకొని ఆమె దగ్గరకు వచ్చి,

"ఇదిగో ఇవి తిను" అన్నాడు.

ఆమె తలెత్తి ఓ క్షణం అర్థరహితంగా అతనిలోకి చూచి, అతనిచేతిలోని రొట్టెను తీసుకుని గబగబా తినడం ప్రారంభించింది.

ఆమె తింటున్న విధానం చూస్తే ఎన్ని రోజుల నుండి ఆకలితో నకనకలాడుతోందో అనిపించి హృదయం జాలితో మూల్గింది.

ఇంతలోనే మరో బెల్‌మ్రోగి - ప్లాట్ ఫాంపై సంరంభం మొదలై.

రెండు నిమిషాల్లో బ్రెడ్‌పూర్తిగా తిని టీని గటగటా తాగుతూ,

ఎందుకో ఆమెవంక అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తూ,

మనుసునిండా మేఘాలు నిండిన ఆకాశంలా భారం -

గ్లాసును క్రిందపెట్టి రెండు చేతులూ జోడించి ... ఆమె ముఖంపై దూరంగా వస్తున్న రైలు లైటు వెలుతురు పడి ... కళ్ళ నుండి కారుతున్న నీటిధారలు -

వెలుతురు చిక్కదనం హెచ్చి చటుక్కున వెనుదిగిరి సంచితో పరుగుతీసి ... ఉరుకుతోంది ఆమె... ప్లాట్‌ఫాం దాటి .... పట్టాలపై నుండి క్యాబిన్‌వైపు .... సిగ్నల్ పోల్స్ దిక్కు -

రైలు ప్లాట్‌ఫాంపైకి రావడం

జనంరొద .... అప్పటిదాకా ఉన్న నిశ్శబ్దం, గంభీరత భగ్నమై ... మళ్ళీ సంరంభం.

★ ★ ★

తమ షాప్ అరుగులపై యాదృచ్ఛికంగా మళ్ళీ ఆమె ప్రత్యక్షమవడం, ముఖంలో అదే దైన్యం .... అదే శూన్యం. అదే నిరాసక్తత. మళ్ళీ ఆ మురళీగానం వింటే ఎంత బాగుండును.

అసలామె ఎవరు. ఆమెకు ఆ వేణు వాదనలో ఎలా పాండిత్యం సంక్రమించింది. ఎందుకామె పిచ్చిదైంది.

పిచ్చిదానిగా పరిగణింపబడుతున్న ఆమె ఎక్కడ ఉంటుంది... ఎక్కడ తింటుంది... ఎవరు పెడతారు. ఆటవిక న్యాయం వర్ధిల్లుతున్న ఈ జనారణ్యంలో ఆమె శీలానికి రక్షణ ఏమిటి .....

"పోనీ ఏదైనా చేస్తే ....?"

ఎవరికీ అన్యాయం చేయకుండా మనిషి బలహీనతలను క్యాష్ చేసుకుని ఎదుగుదల కళలో ఎంతో అభివృద్ధిని స్వశక్తితో సాధించిన తను.... ఇప్పుడామెకు ఏదైనాసాయం చేయలేడా ... ఆమెకు శాశ్వత పరిష్కారం వెదుకలేడా!

మెదడు మరుగుతున్న నీటిలా తన్నుకుంటోంది.

ఏదైనా...

ఏదైనా చేయాలి ...

ఏదో మెరుపు మెరిసినట్టయి ముందున్న బజర్ నొక్కి -

గుమాస్తా రాగానే "అర్జంట్‌గా ఓ అరడజను అరటిపళ్ళు, రెండు ఆపిల్స్ తీసుకురా, పో" అని డబ్బిచ్చాడు.

మనసులో తను చేయబొయ్యే ప్రయోగం యొక్క ఫలితమెలా ఉంటుందా అన్న తర్జన భర్జన జరుగుతోంది. పరీక్షరాసిన తర్వాత ఫలితం కోసం ఎదురుచూచి రిజల్ట్స్ వెదుక్కునేప్పుడు కలిగే ఉద్వేగం.

ఎదురుగా ఆమె రోడ్డుపై నుండి పరుగెత్తుతున్నట్టు పోతున్న జనప్రవాహం దిక్కు చూస్తోంది. క్రిందికి వేలాడుతున్న లంగాచివరలు పేలికలుగా చిరిగి, మాసి,

ఈ స్థితి మారిపోతుందా ఇప్పుడు తను చేయబోయే పనితో -

ప్చ్ .... జనం .... గొర్రెజనం.. పిచ్చి జనం.

పిచ్చి మనిషి కోసం ... పిచ్చి జనం.లోపల దుకాన్లో కోలాహలంగా ఉంది. కస్టమర్స్ గంపలో చేపల్లా గిజగిజలాడుతున్నారు. ముందరున్న నాలుగు ఫోన్లలో ఏదోఒకట్టి ఎప్పుడూ మ్రోగుతూనే ఉంది.

ఓ పదినిమిషాలతర్వాత గుమస్తా పళ్ళతో వచ్చాడు. వాటిని అక్కడ పెట్టమనిచెప్పి. "జాగ్రత్తగా విని నేను చెప్పినట్టు చెయ్" అన్నాడు.

"అక్కడ మెట్ల మీద ..." అని చేయితో చూపించి "కూర్చున్న పిచ్చిది ఉంది కదా...."

"ఆమె దగ్గరకు ఈ పళ్ళను పట్టుకెళ్ళి తినడానికి అమెకిచ్చే ప్రయత్నం చెయ్. ఆమె నీకు రెస్పాన్స్ ఇవ్వగానే పళ్లను చూపిస్తూ మన కౌంటర్ దగ్గరకు తీసుకురా.

వచ్చాక పళ్లను ఆమె చేతికిస్తే తినడం ప్రారంభిస్తే అప్పుడు మన కుంకుమభరిణె తీసుకెళ్ళి ఆమె ముఖంపై పొడుగ్గా బొట్టుపెట్టు. తర్వాత మిగిలినపండ్లను పొట్లం కట్టి ఆమె సంచిలో పెట్టు..."

గుమస్తా షాక్ తిన్నట్టుగా చూశాడు ప్రసాదరావు వైపు ... మీకేమైనా పిచ్చి పట్టిందా అన్నట్టు.

"పో ......" అన్నాడు.

గుమాస్తా తప్పదు కాబట్టి పళ్ళపొట్లం తీసుకునివెళ్ళాడు ఆమె కూర్చున్న చోటికి. ప్రసాదరావు గమనిస్తున్నాడు జరుగుతున్న దాన్ని.

షాప్‌లోనుండి జనం కౌంటర్‌లో ప్రక్కనున్న గుమాస్తాకు డబ్బుచెల్లించి పోతూనే ఉన్నారు. రోజుకు ముప్పయ్ నలభై వేలు టర్నోవర్ ఉండే షాపది.

అతనూహించినట్టుగానే ఆమె గుమస్తా వెంట వచ్చింది. పళ్ళివ్వగానే ఎంతో ఆకలిగా తింటోంది. ఆలోగా గుమస్తా ఆమెనుదుట కుంకుమ దిద్దడం... ఆ పని చేస్తుండగా అనుకున్నట్టుగానే కొంతమంది కస్టమర్లూ, ప్రక్కదుకాణాల వాళ్ళూ, దారిన పోయేవాళ్ళూ గుమిగూడారు చోద్యం చూడ్డానికి.

"ఏంటి ... ఎందుకిలా చేస్తున్నారు...." అని ఎవరో ఎవరినో అడుగుతున్న గుసగుస వినబడుతోంది.

ఆమె మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదు. తినడంలో ఉంది. ఆకలి దహించి వేస్తున్నప్పుడు మనిషికి ప్రపంచం కనిపించదు.

గుసగుసలు ఎక్కువై,

ఎవరికివారు చెవుల్లో ప్రశ్నలను కురిపించుకుంటూ -

ప్రసాదరావు హిందూ పత్రికను దీక్షగా చదువుతున్నట్టు అక్షరాల్లో మునిగిపోయాడు. తన దుకాణంలోని గుమస్తాలు కూడా చోద్యం చూడ్డానికి కదిలిపోవడం గమనించాడు. వాళ్ళకూ అర్థం కాలేదు జరుగుతున్నదేమిటో.

కుంకుమపెట్టడం, పళ్ళ పొట్లం సంచిలో పెట్టడం ...... ఆమె లేచి ... ఓ ఋషిలా నిర్లిప్తంగా నడచి వెళ్ళడం జనంలో కలిసి పోవడం జరిగి, జనం ఎక్కడివాళ్ళక్కడ చెదిరిపోతుండగా.

ప్రసాదరావు తన హెడ్ గుమస్తాను పిలిచి "నిన్న మన టర్నోవర్ ఎంత" అనడిగాడు.

"నలభై వేలు" కొందరు వింటున్నారు. వినాలనే ప్రసాదరావు మాట్లాడుతున్నాడు.

"ఈ రోజు ..."

"ముప్పయ్ దాటిందిప్పటికే"

"మనకు పిచ్చిదానిగా కనపిస్తున్న ఆమె లక్కీ గాడెస్ ... అదృష్టదేవతనుకో. రెండు రోజుల నుండి మనం షాప్ తెరిచేసరికి ఆమె మనకు దర్శనమిస్తోంది గదా... ఆమె ఏ దుకాణం ముందు ఆగి మనిమిచ్చిన ఫలహారం తీసుకుంటుందో ఆ రోజు ఆ దుకాణం రాబడి అసాధారణంగా పెరిగిపోతుంది.... అదీ సంగతి. అందువల్ల ఆమె మనవైపు వస్తే కనీసం ఈరకంగా సత్కరించండి. వీలుంటే మరోసారి వచ్చినపుడు మన స్వీపర్ రాజమ్మతో ఓ చీరను కట్టించండి...."

బీజంపడింది... .జనాల్ని మూర్ఖులను చేయడానికి.

ప్రసాదరావుకు తెలుసు ఆమె రేపు మళ్ళీ తప్పకుండా తమ షాప్ దిక్కువస్తుందని. ఎందుకంటే ఆకలి తీర్చబడిందిక్కడే. ఇక ముందు ఆమె ఏ షాప్ ముందు ఆగినా ఆ షాప్ అమ్మకాలు తప్పకుండా బాగుంటాయి. ఎందుకంటే ఈ పీరియడ్ ఎట్లాగూ సీజన్ కాబట్టి. తర్వాత ఆమె 'పిచ్చి దేవత' గా ఎస్టాబ్లిష్ ఐపోతుంది. యిక ఆమె ఎక్కడ ఆగినా మూర్ఖపు జనం ఆమెను ఆదరించకమానరు. ముఖ్యంగా వ్యాపార వర్గాల్లో మూఢనమ్మకాలూ, అంధవిశ్వాసాలూ ఎక్కువగా ఉంటాయి. బహుశా ఒకసారి 'దేవత' అనిపించుకున్న తర్వాత ఆమె శీలం కూడా ఆటోమేటిగ్గా రక్షించబడవచ్చు.

★ ★ ★

మూడు నెలల తర్వాత.

కార్లో వెళ్తున్న ప్రసాదరావును ఆ విశాలమైన నగరంలో ఒక చోట ఓ ఏర్‌కండీషన్డ్ హోటల్ ఓనర్ స్వయంగా ఆమెకు అరటి పండ్లు, మిఠాయీ తినిపిస్తుండడం, మెడలో గులాబీల దండ వేస్తుండడం కనబడింది.

"పిచ్చిదేవత" అంటే ఇప్పుడా నగరంలో ప్రతి పిల్లవానికీ తెలుసు.

ప్రసాదరావు నవ్వుకున్నాడు దూసుకుపోతున్న కార్లో.

అతని చెవుల్లో సన్నగా, శ్రావ్యంగా వేణుగానం వినబడుతోంది జ్ఞాపకాల పొరల్లో నుండి -

'స్వాతి' మాసపత్రిక
ఆగస్ట్ 1985